


## డిస్నీ లాండ్ vs ఇండియా

-సుందరశ్రీ

మధ్యాహ్నం పన్నెండున్నర దాటి పది నిముషాలు అయ్యింది. హడావిడిగా కారు పార్కు చేసి స్కూలులోకి పరిగెత్తాను. మా అమ్మాయిని పికప్ చేసుకోవడానికి పదినిమిషాలు లేటు. టీచరికి మూడ్ బాగోలేకపోతే ఫైన్ వేస్తుంది. క్లాసులోకి వెళ్ళగానే చీకటిగా ఉంది. లంచ్ అయిపోయినట్టుంది. మిగతా పిల్లలందరు నిద్రలోకి జారుకున్నారు. ప్రీతి ఒక మూల బిక్క మొహం వేసుకుని కూర్చుని ఉంది. ఏదో జరిగిందని అర్థమయ్యింది. టీచరుతో ఒక ఐదు నిమిషాలు మాట్లాడి బయటపడ్డాను.

నా చెయ్యి పట్టుకుని బుంగ మూతి పెట్టుకుని నెమ్మదిగా నడుస్తోంది ప్రీతి. నేనేమీ అడగలేదు. తననే చెప్పనీ అని ఎదురుచూస్తున్నాను. క్లాసులో పిల్లలతో గొడవ పడి ఉంటుంది. అంతకన్నా పెద్ద కష్టాలు ఏమీ ఉండవు. ఓ పది నిముషాలయ్యాక ఉండబట్టలేక నెమ్మదిగా చెప్పింది. దాని క్లాసులో ఒక అమ్మాయి డిస్నీలాండ్ వెళుతుందట. సో తను కూడా అర్జెంటుగా రెండురోజుల్లో అక్కడికి వెళ్ళాలి.

"ప్లీజ్ మమ్మీ! ఇంక జన్మలో నిన్నేమి అడగను" అంది సీరియస్‌గా.
ఒక్కోక్కసారి పెద్ద పెద్ద డైలాగులు వదులుతుంది మా అమ్మాయి.

మా ఐదేళ్ళ ప్రీతీని ప్రీస్కూలులో వేసి సంవత్సరంన్నర అవుతుంది. అప్పటినుండే నా కష్టాలు రెండింతలు అయ్యాయి. అప్పటిదాక ఒకే పింక్ డ్రెస్ ప్రతిరోజూ ఎందుకు వేసుకోకూడదో, Barney T.Vshow మూడు గంటలు ఏకధాటిగా ఎందుకు చూడకూడదో అనే విషయాల మీద కొట్టుకునే వాళ్ళము. అవన్నీ కాక కొత్తగా మొదలైన సమస్యల్లో ముఖ్యమైనవి చక్కీచీజ్‌స్‌కి రోజు ఎందుకు వెళ్ళకూడదో, ప్రతి క్లాసుమేట్ కొనుక్కున్న వస్తువులు తనెందుకు కొనుక్కోకూడదో లాంటివేకాకుండా అటు తెలుగు ఇటు ఇంగ్లీష్ కాని హైబ్రిడ్ భాషను భరించడం లాంటివి కూడా ఉన్నాయి. ఒకరోజు అమ్మనైతే ఇంకోరోజు మమ్మీని, ఇంకో రోజు మామ్‌ని.

ప్రస్తుత సమస్యకి వస్తే దాని క్లాసులో టేలర్ అనే అమ్మాయి వచ్చే నెలలో డిస్నీలాండ్ వెళుతోంది. ఆ అమ్మాయి నాన్న, మొత్తం డిస్నీలాండ్ అందాలు, వింతలు పూస గుచ్చినట్టు చెప్పేసినట్టున్నాడేమో ఆ అమ్మాయి రోజూ వచ్చి క్లాసులో పిల్లలందరి ముందు గొప్పలు చెప్పి ఫోజులు కొట్టడము, అది చూసి వీళ్ళంతా వాళ్ళ

అమ్మా నాన్నలని ఊదరగొట్టడం జరుగుతున్న విషయం. అసలే మా చిన్నదానికి ఆ అమ్మాయికి పడదు. దాంతో ఈ డిస్నీలాండ్ పుండు మీద కారం జల్లినట్టుగా అయింది.

ఇంటికి వాళ్ళ నాన్న రాగానే జరిగిందంతా చెప్పింది. ఇంక వెంటనే డిస్నీలాండ్ కి వెళ్ళకపోతే జీవితం వ్యర్థమన్నట్టుగా మాట్లాడింది. సరే మేము కూడా ఇల్లు కదిలి చాలా రోజులయ్యింది. ఇండియాకి ఎలాగో ఆరునెలల్లో వెళ్ళాలని ప్లాన్ చేసుకున్నాము. ఆరునెలల బదులు ఒక నెలలో వెళదామని నిర్ణయించుకున్నాము.

"మనం ఇండియాకి వెళుతున్నామని ఆ టైలర్ కి చెప్పవే! ఇండియాలో మనం ఒక నెల ఉంటాము. వాళ్ళు డిస్నీలాండ్లో ఒక వారమేగా ఉండేది" అన్నాను నేను.
"ఓ మమ్మీ! టైలర్ కాదు. టేలర్ అని ఎన్ని సార్లు చెప్పాలి?" అంది గట్టిగా.
"సర్లే! ఏదో ఒకటి" అన్నాను నేను . . .
"ఏదో ఒకటి కాదు! కరెక్టుగా చెప్పు" అంది మళ్ళీ.
"ఏమంటేనేం! నీ కర్థమయ్యిందిగా" నా వైపు నుండి సమాధానం.
"ఓ! నో! You can't even remember a name" అంటూ సాధించడం మొదలుపెట్టింది.

ఇలాంటి సంభాషణలు మా ఇద్దరి మధ్య ఎన్ని సార్లు జరిగాయో చెప్పలేను. ఈ మాయదారి టేలర్ పేరేమిటో! మన ఇండియాలో టేలర్, టైలర్, కార్పెంటర్ పేర్లంటే నవ్వుతారు. నా కష్టాలు చాలవన్నట్టుగా టైలర్ అనే కొత్త అబ్బాయి క్లాసులో జాయినయ్యాడు. అప్పటినుండి నా confusion ఇంకా పెరిగి పోయింది. టేలర్ కి టైలర్ అని, టైలర్ని టేలర్ అనడం, మా అమ్మాయి నేనేదో ఘోరమైన హత్య చేసినదానిలా చూడ్డం, పెద్ద జడ్జీ లాగా నన్ను సరిచేసి సాధించడం దినచర్యగా మారిపోయింది.

మర్నాడు స్కూలునుండి రాగానే మళ్ళీ బిక్క మొహం వేసింది.

"మళ్ళీ ఏమయ్యింది?" అన్నాను నేను.
"డిస్నీలాండ్ లో బోల్డు రైడ్స్ ఉన్నాయి ఇండియాలో ఏమీ ఉండవంది టేలర్"
"ఎందుకు లేవు? మన హైదరాబాదులో మాల్లో అన్ని రైడ్స్ ఉన్నాయి. Waterpark కూడా ఉంది. బోట్ రైడింగ్, ప్లానిటోరియం, సైన్స్ మ్యూజియం కావాల్సినన్ని ఉన్నాయి" అన్నాను నేను.

ఆరోజు మొదలుకుని మా ఇంట్లో డిస్నీలాండ్ Vs ఇండియా వాదనల పోటీ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ కన్నా ఉత్కంఠంగా జరిగింది. మా అమ్మాయి స్కూలు నుండి డిస్నీలాండ్ గొప్పదనం గురించిన వివరాలు తీసుకురావడం, మేము దాన్ని మించినట్టుగా ఇండియాలో విశేషాలు చెప్పడం ప్రాసిక్యూషన్, డిఫెన్స్ రిబట్టల్ స్టైల్లో మంచి రసవత్తరంగా జరిగింది.

కొన్ని మచ్చుతునకలు.
"డిస్నీలాండ్లో 'జ్యూరాసిక్ పార్క్ రివర్ రైడ్' చాలా స్కేరీగా ఉంటుంది"
"హైదరాబాద్ జూలో నువ్వు నిజమైన వైట్ టైగర్ చూడొచ్చు. అది ఇంకా స్కేరీగా ఉంటుంది. ఇక్కడెక్కడా దగ్గరి జూలో వైట్ టైగర్ లేదు" కూతురికి తండ్రి సమాధానం.
"డిస్నీలాండ్ లో 'జంగల్ క్రూజ్' లో ఆలిగేటర్స్, చింపాంజీస్ బోల్డు రియల్ గా ఉంటాయి. జంగిల్ పీపుల్ బాగా డాన్సు చేస్తారట" మా అమ్మాయి ఉవాచ.
"ఇండియాలో మీ పెద్దమ్మ ఊరికి వెళితే రియల్ జంగల్ కి వెళ్ళినట్టుగానే ఉంటుంది. కుక్కలు, పిల్లులు, కోతులు. . . . .అన్నట్టు నువ్వెప్పుడు బుల్లకార్టు ఎక్కలేదు కదా ! It is a very cool ride. . . . you know and only available in India" అని ఊరించాను.
చివరికి మూడో రోజో నాల్గోరోజో
"టీ కప్పు రైడ్ ఎంత స్కేరీగా ఉంటుందో అంత ఫన్‌గా ఉంటుంది అంది టేలర్. అప్పుడు నేనే మన్నానంటే" దీర్ఘం తీస్తూ ఆగింది ఒక నిమిషం.
"సీ టీ కప్ రైడ్ కన్నా మా ఇండియా కార్ రైడ్ ఎంత బావుంటుందో తెలుసా సీటు బెల్ట్ పెట్టుకోనక్కర్లేదు. ఫ్రంట్ సీట్లో కూర్చోవచ్చు" అంటూ ముగించింది.

ప్రీతి మాట్లాడటం పూర్తయ్యేసరికి ఇదేదో శ్రుతి మించి రాగాన పడుతున్నట్టుగా అనిపించింది. అసలు ఈ ఎపిసోడ్ మొదలైన విధానమే నాకు నచ్చలేదు. ఈ రకమైన పోలికలు ఒకరిని మించి ఒకరుండాలనే ధోరణే అసలు ఎంకరేజ్ చెయ్యకూడదు. కాని మన దేశమంటే అభిమానము, మనం ఎందులోను తీసిపోమని చెప్పాలనే తాపత్రయం ఇంతవరకు తీసుకొచ్చిందేమో! సరే ఇంక ఈ ధోరణి ఎలా ఆపుచెయ్యాలో ఆలోచించాలి. అన్నిటికన్నా ముఖ్యమైనది తమకున్న వాటితో తృప్తి పడటం, ఎదుటివాళ్ళను గౌరవించి, ప్రేమించడం ముఖ్యమని ప్రీతికి రేపు వివరించి చెప్పాలి.

ఆలోచిస్తూండగానే రాత్రయ్యింది. ప్రీతీ పడుకునే వేళయ్యింది. దానికిష్టమైన సిండెరెల్లా కథని వెయ్యోసారి, మా ఇద్దరికి ఇష్టమైన పంచతంత్ర కథని వందోసారి చెప్పి, గుడ్ నైట్ చెప్పి, గది నుండి బయటికి వస్తూండగా మళ్ళీ డిస్నీ లాండ్ ప్రసక్తి తెబోయింది.

"ప్రీతీ! మనం ఇంక ఆ విషయం గురించి మాట్లాడొద్దు. నీ ఫ్రెండ్ ఎంత గొప్పలు చెప్పినా నువ్వు పట్టించుకోవద్దు. ఇలా దెబ్బలాడుకోవడం, ఒకరితో ఒకరు పోటీ పడటం మంచిది కాదు. నువ్వెంత . . ."
ఇంకా ఏదో చెప్పబోతుండగా, ప్రీతి నన్ను మధ్యలో ఆపుచేసి,
"అది కాదు అమ్మా!" అంటూ పెద్ద పెద్ద కళ్ళు తిప్పుతూ
"నే చెప్పేది విను! నేనే మన్నానంటే నాకు మా గ్రాండ్ మా ఎయిర్ పోర్ట్ కి వస్తుంది. బోల్డు హగ్స్, ముద్దులు ఇస్తుంది. నాకు వెకేషన్ అంతా స్టోరీస్ చెపుతుంది. My vacation is better than yours because I

get lots of love అన్నాను. అప్పుడు టేలర్ ఏమందో తెలుసా?" అంది.
"ఏమంది?" అన్నానేను.
" I wish i have a vacation like yours అంది. నేనే మన్నానంటే నువ్వు నాతో రావొచ్చు కావాలంటే అన్నాను." అంది.
"వెరీగుడ్! చాలా బాగా చెప్పావమ్మా! పడుకో" అంటూ అనుకోని ఈ మలుపుకి ఆశ్చర్యపోతూ గదిలో నుండి బయటకి వచ్చాను.

ఒక్కసారిగా మనస్సు తేలిక పడ్డట్టయ్యింది. నేనేమి చెప్పాలనుకున్ననో, అదే దాని నోటి నుండి బయటికొచ్చింది. అవతలి గదినుండి ఈ సంభాషణ అంతా వింటున్న శేఖర్ అన్నాడు "కథ సుఖాంతమయేటట్టుందే!"
"ఇంక ! టైలర్కి దీనికి గొడవలుండవు" అన్నాను నేను.
వెంటనే తుపాకీ గుండులా గది నుండి మా అమ్మాయి కంఠం "టైలర్ కాదు టేలర్"
"అబ్బా! ఏదో ఒకటిలేవే. నా ప్రాణం తీయకు." నా సమాధానం.
"ఏదో ఒకటి కాదు సరిగ్గా చెప్పు."
యధావిధిగా ఎప్పటిలాగే మా సంభాషణ సాగిపోతోంది. . . . ****



భర్త , ఇద్దరు పిల్లలతో బోస్టన్ లో నివాసం. నాన్న గారు చిన్నపటినుంచీ సాహిత్యంపట్లా, శాస్త్రీయ సంగీతంపట్లా ఆసక్తిని కలిగించారు. దూరప్రయాణాలంటే ఇష్టం. ఆఫీసూ, ఇల్లూ, పిల్లలూ..అన్నింటితో అష్టావధానం..రోజుకి ఇరవై నాలుగు గంటలకంటే ఎక్కువ ఎందుకు ఉండవా అని అప్పుడప్పుడూ ఆశ్చర్యం..!